క్లుప్తంగా

485 మందికి ప్లాట్లు కేటాయింపు

పీలేరు : పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో భాగంలో స్థానిక ఏపీఐఐసీ-3 జగనన్న లేఅవుట్‌లో 385 మంది లబ్ధిదారులకు లక్కీడిప్ ద్వారా ప్లాట్లు కేటాయించినట్లు తహసీల్దార్ మహబూబ్‌బాషా తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు ఆన్‌లైన్‌లో లక్కీడిప్ తీసి ప్లాట్లు కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు పారదర్శకంగా ప్లాట్లు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీలు సుబ్రమణ్యం, లోకేశ్వర్‌రెడ్డి, ఆర్‌ఐ చాణక్య పాల్గొన్నారు.

నేడు వంద పడకల ఆస్పత్రి ప్రారంభం

పీలేరు : పట్టణంలో రూ. 24 కోట్లతో 50 నుంచి వంద పడకలకు స్థాయి పెంచిన పీలేరు ప్రభుత్వాస్పత్రిని గురువారం రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. సాయంత్రం 3 గంటలకు ఆస్పత్రి ప్రారంభోత్సవం, 3.30 గంటలకు ఇళ్ల పట్టాలు పంపిణీ, 4 గంటలకు స్థానిక కడప రోడ్డు మార్గంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు.

ఉపాధి పనుల తనిఖీ

కలికిరి: మండలంలోని టి.సంగ్రావారిపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఎంపీడీఓ రామక్రిష్ణయ్య తనిఖీ చేశారు. ఉపాధి కూలీలకు అందుతున్న వేతనాలు, పనులు చేస్తున్న కూలీలకు కల్పించిన వసతులపై ఆయన విచారించారు. కూలీల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేసి, కూలీలు నష్టపోకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మునెళ్ళపల్లి గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎంపీడీఓ రికార్డులను పరిశీలించారు. సచివాలయం సేవలపై విచారించారు.

నేడు టీ-20 క్రికెట్ జట్టు ఎంపిక

కలికిరి: స్థానిక ఓఎంఎం క్రికెట్ గ్రౌండ్‌లో గురువారం ఉదయం 10 గంటల నుంచి జిల్లా స్థాయి అండర్ -19 విభాగంలో టీ-20 క్రికెట్ జట్టు ఎంపిక ప్రక్రియ జరుగుతుందని టీ-20 క్రికెట్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఆసక్తి కలిగిన క్రికెట్ క్రీడాకారులు హాజరవ్వాలన్నారు. వివరాలకు 9848693874, 8374543595 సంప్రదించాలని కోరారు.

రైతులకు మరింత భరోసా

కలకడ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు మరింత భరోసా ఇవ్వడానికే ప్రతి ఏడాది పీఎం కిసాన్‌తో పాటు, రైతు భరోసా నిధులు ఇస్తున్నారని ఎంపీపీ శ్రీదేవి, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం ముఖ్యమంత్రి రైతులకు రైతు భరోసా నిధులు, వడ్డీ నగదు బదిలీకి బటన్‌నొక్కి నిధులు విడుదల చేశారు. సీఎం ప్రసంగాన్ని బుధవారం మండలంలోని బాలయ్యగారిపల్లె రైతుభరోసా కేంద్రంలో వీక్షించి రైతులకు జగన్న ప్రభుత్వంలో కలుగుతున్న ప్రయోజనాలను తెలియజేశారు.

జిరాక్స్ మిషన్ వితరణ

పెద్దమండ్యం: శిద్దవరం కస్తూర్బా గాంధీ బాలికా గురుకుల విద్యాలయానికి దాత జిరాక్స్ మిషన్‌ను వితరణగా ఇచ్చారు. మండలంలోని సీ గొల్లపల్లె పంచాయతీ చిన్నాయునివారిపల్లెకు చెందిన బోర్‌వెల్ కుమార్‌నాయుడు తన కుమార్తెను కేజీబీవీలో చదివిస్తున్నాడు. ఈ క్రమంలో తన కుమార్తెను చూసేందుకు అప్పుడప్పుడు భార్యతో కలిసి వెళ్లేవారు. విద్యార్థినిలకు ఆధార్, తదితర జిరాక్స్‌ల కోసం దూరం వెళ్లాల్సి వచ్చేది. ఈ క్రమంలో విద్యార్థినిలకు సమస్య లేకుండా ఉండాలని రూ.15 వేలతో జిరాక్స్ మిషన్ కొనుగోలు చేసి బుధవారం ప్రిన్సిపల్ రాణికుమారికి అందజేశారు.

ఘనంగా జేవీవీ ఆవిర్భావ దినోత్సవం

వాల్మీకిపురం: జేవీవీఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేవీవీ అధ్యక్షుడు ప్రభచరణ్ మాట్లాడుతూ సమాజంలో పాతుకుపోయిన మూఢ విస్వాసాలను నియంత్రించడంతో పాటుగా నిరక్షరాస్యత నిర్మూలన, మద్యపాన నిషేధం, విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత వంటి లక్షణాలతో జనవిజ్ఞాన వేదిక ఏర్పడిందన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

పెద్దతిప్పసముద్రం: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను బుధవారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (హెచ్‌ఎన్ఎస్ఎస్-యూనిట్-1) రాఘవేంద్ర ఆకస్మికంగా తనిఖీ చేశారు. మల్లెల పంచాయతీలోని ఉప్పరవాండ్లపల్లిలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఓటర్లకు కనీస సౌకర్యాలతో పాటు ర్యాంప్ సౌకర్యంపై ఆరా తీశారు.

నేడు కన్నెమడుగుకు మంత్రి రాక

తంబళ్లపల్లె: మండలంలోని కన్నెమడుగు పంచాయతీలో గురువారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పర్యటిస్తారని సర్పంచు శ్యామలమ్మ, ఎంపీటీసీ సభ్యులు మహేష్, మల్లయ్యకొండ ఈఓ రమణ తెలిపారు. చిన్న మాచిరెడ్డిగారిపల్లెలో వెలసిన ఆవుదేవర దేవస్థానం ఆలయ పునఃనిర్మాణానికి జరిగే భూమి పూజలో పాల్గొంటారన్నారు.

సాంకేతికతతోనే ఉజ్వల భవిష్యత్తు




పెద్దతిప్పసముద్రం : సైన్స్ ప్రాజెక్టులను పరిశీలిస్తున్న డీవైఈఓ శ్రీరామ్ పురుషోత్తం, మదనపల్లె: ఎగ్జిబిట్‌ను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దతిప్పసముద్రం: విద్యార్థులు సాంకేతికతను అంది పుచ్చుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డీవైఈవో శ్రీరామ్ పురుషోత్తం అన్నారు. బుధవారం జరిగిన జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఆయన మండల కేంద్రంలోని తెలుగు జెడ్పీ హైస్కూల్‌లో లాంఛనంగా ప్రారంభించారు. విద్యార్థుల మేథోశక్తిని పెంచేలా తయారు చేసిన ప్రాజెక్టులను ఆయన క్షుణంగా పరిశీలించారు. సైన్స్ ఆవిష్కరణలతోనే దేశాభివృద్ధి సాధ్యమని పిల్లలకు వివరించారు. ఆయన వెంట ఎంఈఓలు నారాయణ, గౌస్‌పీర్, హెచ్‌ఎం అపర్ణాదేవి ఉన్నారు.

వైజ్ఞానిక శిఖరం సీవీ రామన్

కురబలకోట: ప్రొఫెసర్ సీవీ రామన్ శాస్త్ర రంగంలో వైజ్ఞానిక శిఖరమని అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రామనాథన్ కొనియాడారు. బుధవారం జరిగిన సైన్స్‌డేలో ఆయన మాట్లాడుతూ భారతీయ వైజ్ఞానిక ప్రతిభా పాటవాలు ప్రపంచానికి తెలిపిన ఘనుడన్నారు.

సైన్సుతోనే మానవ మనుగడ

మదనపల్లె సిటీ: సైన్స్‌తోనే మానవ మనుగడ సాధ్యమని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం జాతీయ విజ్ఞాన దినోత్సవం పురస్కరించుకుని పాఠశాలలో సైన్సుడేను ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు వివిధ సైన్స్ మోడల్స్‌ను ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి వైజ్ఞానిక అభివృద్ధిలో పెంపొందించాలని తెలిపారు. సైన్సు లేనిదే జీవితం లేదన్నారు. అనంతరం డాక్టర్ సీవీ రామన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో జాతీయ సైన్సు దినోత్సవం నిర్వహించారు

మానవాళికి మెరుగైన జీవనం

వాల్మీకిపురం: మానవాళికి మెరుగైన జీవనం సైన్స్‌తోనే సాధ్యమని మండల విద్యాశాఖ అధికారి వెంకటరత్నం అన్నారు. బుధవారం మండల వ్యాప్తంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సైన్స్ మేళాలను నిర్వహించారు. స్థానిక పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జడ్పీ బాలికోన్నత పాఠశాల, ఏపీఆర్ మైనార్టీ గురుకుల పాఠశాలలో ఎంఈవో వెంకటరత్నం సైన్స్ ప్రయోగాలను పరిశీలించి అభినందించారు. అనంతరం సైన్స్ దినోత్సవం జరుపుకుంటూ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. అలాగే ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో సైన్స్‌డేని నిర్వహించారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం

కలికిరి: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా సైన్స్ డే నిర్వహించారు. సీఆర్‌సీ పరిధిలోని పది పాఠశాలల విద్యార్థులు వర్కింగ్ మోడల్స్, డెమో మోడల్స్‌ను ప్రదర్శించారు. పరిశీలించిన మండల విద్యాశాఖాధికారి కరీముల్లా ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు.

కేవీపల్లెలో..

కేవీపల్లె : మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సీకేఆర్‌పల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలను హెచ్‌ఎం చంద్రయ్య పరిశీలించారు. సైన్స్ ప్రదర్శనల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

రమసముద్రంలో..

రామసముద్రం: రామసముద్రం తూర్పుపాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు హేమలత ఆధ్వర్యంలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు సృజనాత్మక శక్తి పెంపొందించి బావి శాస్త్రవేత్తలుగా ఎదిగే స్ఫూర్తి ఇలాంటి ప్రదర్శనలతో వస్తుందని హేమలత తెలిపారు. అనంతరం ప్రదర్శనలు తిలకించి విద్యార్థుల ప్రతిభను ప్రసంశించారు.

శ్రీనివాస డిగ్రీ కాలేజీలో..

మదనపల్లె సిటీ: స్థానిక శ్రీనివాస డిగ్రీ కాలేజీలో బుధవారం జాతీయ సైన్సు దినోత్సవం జరిగింది. డిపార్టుమెంట్ ఆఫ్ లైఫ్ సైన్సు, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థుల చేత బ్లడ్ టెస్ట్ పోలియో వ్యాక్సినేషన్ ప్రాసెస్ ప్లాంట్,ఫోటో ప్లాస్ట్ కల్చర్ వాటర్ ప్యూరిఫికేషన్ ప్రాసెస్ డీఎన్ఏ మోడల్ మొదలైన అంశాలతో అవగాహనతో పాటు ప్రాక్టికల్‌గా చేసి చూపించారు.

ప్రతి విద్యార్థి ఒక సైంటిస్టు కావాలి

తంబళ్లపల్లె: విద్యార్థులు మేధోశక్తిని వినియోగించుకుని ఉన్నత చదువులతో సైంటిస్టులుగా కావాలని ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడులు కోరారు. అన్ని పాఠశాలల్లోను జాతీయ సైన్సు విజ్ఞానమేళ కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ప్రయోగాత్మకంగా సైన్సు ఎగ్జిబీషన్‌ను చేశారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

పీలేరు : విద్యార్థులు తమ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఎంఈఓ లోకేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు పాఠశాలల్లో విద్యార్థులు ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. వివిధ పాఠశాలలో సైన్స్ ప్రదర్శనలను ఎంఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రంలో విద్యార్థులు పట్టు సాధించాలని సూచించారు. పరిశోధనల వైపు విద్యార్థి దశ నుంచే మొగ్గు చూపాలని తెలిపారు. విజ్ఞాన శాస్త్రం విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరివైపు మళ్లిస్తుందన్నారు.



వాల్మీకిపురం: విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న ఎంఈఓ వెంకటరత్నం



రామసముద్రం : తూర్పుపాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ పరిశీలిస్తున్న ఎంఈవో హేమలత



పీలేరు: సైన్స్ ప్రదర్శనలను పరిశీలిస్తున్న ఎంఈవో లోకేశ్వర్‌రెడి

పక్క రాష్ట్రాల పాలకుల చూపు ఏపీ వైపు

- తంబళ్ళపల్లి నియోజక వర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసా
- ప్రాజెక్టులను ఆపించిన పాపం చంద్రబాబుదే
- వైఎస్సార్ ఆసరా బహిరంగ సభలో ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి




సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

ములకలచెరువు: ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసిన పక్క రాష్ట్రాల పాలకులందరూ ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శంగా తీసుకుంటున్నారని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ములకలచెరువులో బుధవారం జరిగిన వైఎస్సార్ ఆసరా బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తంబళ్ళపల్లి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామన్నారు. శిథిలావస్థకు చేరుకున్న పురాతన కాలం నాటి ఆలయాలకు రూ.కోట్ల నిధులతో పూర్వ వైభవం తెచ్చేందుకు తాను కంకణం కట్టుకున్నానన్నారు. మూడు నియోజక వర్గాల ప్రజలకు ఇంటింటా ఫ్లోరైడ్ రహిత మంచినీరు అందించేందుకు రూ.వేల కోట్ల నిధులతో ప్రాజెక్టు పనులు చేయాలని తలిస్తే చంద్రబాబు కోర్టులకు వెళ్ళి పనులను ఆపించారని ఆరోపించారు. గత ప్రభుత్వాల్లో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలోని రైతాంగ ప్రజలకు వేల సంఖ్యల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఇచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కిందన్నారు. అంతేగాక భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలో అదనపు సబ్ స్టేషన్ల మంజూరుతో పాటు 132 కేవీ సామర్థ్యం గల మరో విద్యుత్ సబ్ స్టేషన్ పనులకు గాను టెండర్లు పిలుస్తున్నామన్నారు. అదే విధంగా పార్టీలకతీతంగా మంజూరవుతున్న పథకాలు, జగనన్నకు వస్తున్న ప్రజాదరణను ఓర్వలేని చంద్రబాబు కుటిల రాజకీయాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. స్వార్థ రాజకీయాల కోసం కలసికట్టుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రాన్ని రెండు ముక్కలుగా విడదీసిన పాపం మాజీ సీఎంలు కిరణ్, చంద్రబాబుదే అన్నారు. లోకేష్‌కు రాజకీయ పరిపక్వత లేని నాయకుడని ఇతరులు రాసిచ్చిన స్క్రిప్టులను చదివే వ్యక్తి అన్నారు. గత టీడీపీకి ఇప్పుడు వైఎస్సార్‌సీపీ పాలనలో మంజూరైన పథకాలు, జరిగిన అభివృద్ధిని ప్రజలే బేరీజు వేసుకోవాలని మంచి చేసామని భావిస్తే మళ్ళీ వైఎస్సార సీపీ పాలకులను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. అనంతరం ములకలచెరువు, తంబళ్ళపల్లి మండలాల్లోని 1,469 సంఘాలకు సంబంధించి నాల్గవ విడత మంజూరైన రూ.13.55 కోట్ల వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును ఆవిష్కరించారు. అనంతరం వలంటీర్లను సత్కరించారు. ఆయన వెంట ఎంపీపీలు సాయిలీలా, అనసూయమ్మ, జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, కన్వీనర్‌లు మాధవరెడ్డి, చౌడేశ్వర్, సర్పంచ్‌లు రహ్మత్‌బి, మంజుల, సుధాకర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, జయచంద్ర, ఎంపీటీసీలు రేష్మా, ఆయీషా, క్రిష్ణప్ప, జ్యోతి, నాయకులు రవీంద్రారెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, ఉమా మహేష్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన అవసరం

- డీఎస్పీ ప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాదరెడ్డి

మదనపల్లె : పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని పోలీస్ సిబ్బంది ఎన్నికలకు సంబంధించిన నేరాలు, చట్టాలు, నియమావళిపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ ప్రసాదరెడ్డి అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నియమావళి, భద్రతాచర్యల సందర్భంగా పోలీసు అధికారులు ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలు, చేపట్టాల్సిన చర్యలపై జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు... సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులకు బీటీ ప్రభుత్వడిగ్రీ కళాశాలలో బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డీఎస్పీ ప్రసాదరెడ్డి, ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్, ఎస్సీ,ఎస్టీ సెల్ డీఎస్పీ సుధాకర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...సార్వత్రిక ఎన్నికల సందర్భంగా హోంగార్డు నుంచి చివరిస్థాయి ర్యాంకు అధికారి వరకు ప్రతిఒక్కరు ఎన్నికల సంఘం నియంత్రణ, పర్యవేక్షణ, క్రమశిక్షణకు లోబడి పని చేయాలని ఆదేశించారు. రానున్న 50 రోజులు పోలీసులకు చాలా కీలకమన్నారు. ఎలక్షన్స్ సందర్భంగా పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సంబంధిత పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండి పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ), క్రిటికాలిటీ, నార్మాలిటీ, ఫ్లయింగ్‌స్క్వాడ్, సర్విలెన్స్ టీమ్, చెక్‌పోస్ట్, పోలింగ్‌స్టేషన్ డ్యూటీలు తదితర అనేక అంశాలపై అవగాహన కల్పించారు.

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోండి

పీలేరు రూరల్ : ప్రతి ఒక్కరూ తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి తపాలా శాఖ ఎస్ఎస్‌పీ ఎం. జాఫర్‌సాధిక్ అన్నారు. బుధవారం స్థానిక ఇందిరమ్మ కాలనీలో జనంలోకి మనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో తపాలా సేవలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలన్నారు. పీలేరు, వాల్మీకిపురం సబ్ డివిజన్ పరిధిలో 3100 కొత్త ఖాతాలు నమోదు చేసినట్లు తెలిపారు. ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంకుకు సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరంలో 2150 ఖాతాలు ఓపెన్ చేసినట్లు తెలిపారు. సుకన్య సమృద్ధి యోజన పథకం మీ అమ్మాయి బంగారు భవితకు కొండంత అడ అని తెలిపారు. అలాగే గ్రామీణ తపాలా జీవిత బీమా పథకం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఎస్‌పీ నాగరాజ, తిరుపతి పోస్టల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రంజిత్‌కుమార్, ఐపీపీబీ మేనేజర్ శైలేష్‌కుమార్, పోస్టల్ ఇన్స్‌పెక్టర్ పవన్‌కుమార్, పోస్ట్‌మాస్టర్ వై. శేషాద్రి, బీపీఎం లావణ్యం పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం తథ్యం



మాట్లాడుతున్న పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి

కేవీపల్లె : త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం తథ్యమని వైఎస్సార్‌సీపీ పీలేరు, కేవీపల్లె మండలాల ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గ్యారంపల్లె, మఠంపల్లె, తీతవగుంటపల్లె, మహల్‌రాజుపల్లె, తువ్వపల్లె, ఎంపీపల్లె, నూతనకాల్వ, జిల్లేళ్ళమంద, వడ్డకుంట పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ గ్రామ స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి ఆర్థిక లబ్ధి చేకూరిందన్నారు. ఈ విషయాన్ని పార్టీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, గజ్జెల శీన్‌రెడ్డి, పొత్తపు సతీష్ రెడ్డి, సాహిత్‌రెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఐకమత్యంతో గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

కలికిరి: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని ఏపీఎండీసీ డైరెక్టర్ సి.హరీష్ రెడ్డి అన్నారు. గండబోయనపల్లిలోని ఆయన అతిథిగృహంలో బుధవారం కలికిరి గ్రామ పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో కష్టపడ్డ కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని, నియోజకవర్గంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వచ్చే ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏలాంటి తప్పిదాలు, బేషజాలకు తావులేకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎన్నికల సమాయత్తంపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ సతీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్టీడి హరి, సీనియర్ నాయకులు క్రిష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు భోగేష్, జేసీఎస్ మండల కన్వీనర్ రెడ్డెప్ప, ముస్లిం జేఏసీ వ్యవస్థాపకుడు ఎంఐ హనీఫ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాయినింగ్ ది డాట్స్ శిక్షణకు 20 మంది ఎంపిక

మదనపల్లె సిటీ: బెంగళూరుకు చెందిన జాయినింగ్ ది డాట్స్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ ధనుంజయ ఇస్తున్న ఉచిత శిక్షణకు స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీ విద్యార్థులు 20 మంది ఎంపికయ్యారు. వీరికి 12 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణకు ఎంపికైవారికి ధనుంజయ బృందం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సిల్వర్ మెడల్స్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కాలేజీ కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ మాట్లాడుతూ ఎంపికైన 20 మంది విద్యార్థులకు ఏడాది పాటు పైథాన్, డేటా స్ట్రక్చర్స్, ఆల్గరిథం, ఫ్రంట్ అండ్ బ్యాక్ ఎండ్, మాక్ ఇంటర్వ్యూలు, పీర్ ఇంటర్వ్యూలు, కోడింగ్ అసైన్మెంట్ హాకథాన్ తదితర అంశాలపై ఏడాది పాటు ఉచితంగా శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ పూర్తయ్యాక సాఫ్ట్‌వేర్ సంస్థలతో ఇంటర్వ్యూలు నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఎంపికైన విద్యార్థులకు ప్రిన్సిపల్ రమాదేవి, అధ్యాపకులు హేమశేఖర్ అభినందించారు.

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

బి.కొత్తకోట: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పేదలకు ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్సలు పొందితే వారికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆదుకోవడం జరుగుతోందని చెప్పారు. తాజాగా నియోజకవర్గంలోని దేవలచెరువుకు చెందిన షేక్ మహమ్మద్ ముదిస్సర్‌కు రూ.1.40 లక్షలు, కంటేవారిపల్లెకు చెందిన పి.వెంకటశివకు రూ.2.20లక్షలు, యేసువారిపల్లెకు చెందిన కే.గీతకు రూ.2 లక్షలు, చౌడసముద్రంకు చెందిన ఎన్.సుధాకర్‌నాయుడుకు రూ.1.10లక్షలు, బూర్లపల్లెకు చెందిన జీ.నారాయణస్వామికి రూ.5లక్షలు మంజూరైనట్లు తెలిపారు.

రెడ్డెమ్మకొండ ఆలయ నిర్మాణానికి విరాళం

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రెడ్డెమ్మకొండ ఆలయ పునర్ని నిర్మాణానికి వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలం సగిలిగుడ్డుపల్లెకు చెందిన రెడ్డెయ్యరెడ్డి దంపతులు రూ.25,116 వేలు విరాళంగా అందజేశారు. బుధవారం ఆలయానికి విచ్చేసిన దాతలకు ఆలయఅధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం దాత రెడ్డెయ్యరెడ్డి విరాళ మొత్తాన్ని ఆలయ ఇన్స్‌పెక్టర్ బాలకృష్ణకు అందజేశారు. రెడ్డెమ్మకొండ చైర్మెన్ నరసింహారెడ్డి, ఈవో మంజుల దాతకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆడుదాం ఆంధ్రా క్రీడాకారులకు బహుమతుల ప్రదానం

కలికిరి: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలలో పీలేరు నియోజకవర్గ స్థాయిలో కలికిరి మండల క్రీడాకారులు సత్తాచాటారు. కలికిరి-3 సచివాలయానికి సంబంధించిన క్రీడాకారుల్లో పురుషుల ఖోఖో విభాగం, కలికిరి-2 సచివాలయానికి చెందిన క్రీడారులు పురుషుల బ్యాట్‌మింటన్ విభాగం, మేడికుర్తి సచివాలయ క్రీడాకారులు పురుషుల విభాగం, మహల్ సచివాలయ క్రీడాకారులు మహిళల బ్యాట్‌మింటన్ విభాగాల్లో విజేతులుగా నిలిచారు. వీరికి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ రామక్రిష్ణయ్య, మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నశేఖర్ రెడ్డి చేతుల మీదుగా ట్రోఫీలు, మెడల్స్, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు.

పోలియో రహిత సమజాన్ని నిర్మిద్దాం

పీలేరు : సమష్టి కృషితో పోలియో రహిత సమజాన్ని నిర్మిద్దామని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలకు పల్స్‌పోలియో కార్యక్రమ నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 3వ తేదీన జరిగే జాతీయ పల్స్‌పోలియో కార్యక్రమంలో 0-5 సంవత్సరాల పిల్లలకు రెండు పోలియో చుక్కలు వేసి నిండు జీవితానికి భరోసానిద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈ కొండయ్య, పర్యవేక్షకులు కుసుమ, తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయండి

వాల్మీకిపురం: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్ తెలిపారు. బుధవారం మండలంలోని చింతపర్తి పిహెచ్‌సిని ఆయన తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న మార్చి 3వ తేదీ ఆదివారం జాతీయ సామూహిక పోలియో చుక్కల కార్యక్రమం నేపథ్యంలో పిహెచ్‌సి వైద్యులు, సిబ్బంది, అనుబంధ శాఖల సిబ్బందితో కలసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది కరుణ, భానుబి తదితరులు పాల్గొన్నారు.

వయో వృద్ధుల సమస్యలు పరిష్కరించాలి

మదనపల్లె సిటీ: వయో వృద్ధుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించడానికి చొరవ చూపాలని ఏపీ సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునిగోపాలకృష్ణ తెలిపారు. బుధవారం యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం విశాఖపట్నంలో జరిగింది.